క్లుప్తంగా

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



జగ్గంపేట సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న రఘురాం

జగ్గంపేట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. రఘురాం జన్మదినం సందర్భంగా ఆయన అనుచరులు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో రఘురాం జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు సమక్షంలో రఘురాం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్లపై విమర్శలు తగవు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: గ్రామ వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శలు చేయడం తగదని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న వలంటీర్లను విమర్శించడం సరికాదన్నారు. వలంటీర్ వ్యవస్థను విమర్శించే హక్కు వ్యక్తులకు గాని, పార్టీలకు గాని లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జి, తాతబాబు, చంటి తదితరులు పాల్గొన్నారు.

వారికి ఉద్యోగాలు ఇవ్వకుంటే సమ్మె చేస్తాం



తుని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

తుని: స్థానిక మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికులుగా దీర్ఘకాలంగా పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలివ్వాలని, లేకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తునిలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ తుని మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న పెదపూడి శేషగిరి, సింగంపల్లి భవాని, కాకడ లోవరాజు చనిపోయారన్నారు. వీరి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ తుని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజుకు అనేక సార్లు వినతిపత్రాలు అందించామన్నారు. రెండు రోజుల్లో అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేకుంటే ఈ నెల ఐదు నుంచి నిరవధిక సమ్మె చేపడతామని కమిషనర్ ప్రసాద్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు చక్కా అప్పారావు, బోడపాటి నూకరాజు, చిట్టిబాబు, నేలపల్లి కిషోర్, శాంత కుమారి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న పాలవెల్లువ ప్రారంభం

తొండంగి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో గురువారం జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ బుధవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 26 గ్రామ సచివాలయాలు ఉండగా 17 సచివాలయాల్లో జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు సమక్షంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. గ్రామాల్లో పాడిరైతులు పాలవెల్లువను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రత్తిపాడు: ప్రజలు గంజాయి, సారా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ సూచించారు. స్థానిక మార్కెట్ వద్ద బుధవారం డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా, గంజాయి రవాణా, క్రయ విక్రయాలపై ఎటువంటి సమాచారం తెలిసినా వెంటనే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. స్థానిక ఎస్‌ఈబీ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు ఎస్. వెంకన్నదొర, ఎల్.కృష్ణార్జున పాల్గొన్నారు.

సాగుకు ప్రోత్సాహం.. రైతుకు ఉత్సాహం

- ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు
- అన్నదాతలకు పలు రాయితీలు
- తుని సబ్ డివిజన్ పరిధిలో 3,316 ఎకరాల్లో సాగు

తుని రూరల్: ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. రైతులకు లాభాలు తెచ్చిపెడుతున్న ఆయిల్ పామ్ తోటల సాగు విస్తర్ణం పెంచేందుకు ఉద్యానశాఖ ద్వారా రాయితీలు ఇస్తోంది. మంచి గిట్టుబాటు ధర కల్పిస్తున్న ప్రభుత్వం కొత్తగా మొక్కలు నాటే రైతులకు పలు రాయితీలు ప్రకటించింది. అధికారుల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

25 వేల ఎకరాల్లో సాగు

కాకినాడ జిల్లాలో ఇప్పటికే 25 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో ఐదు వేల ఎకరాల్లో సాగు విస్తరణం పెంచాలన్నది లక్ష్యం. ఉద్యానశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 3,316 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం మరో 625 ఎకరాల్లో మొక్కతోటలు వేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ సీజన్‌లో ఆయిల్ పామ్ మొక్కలు వేస్తే నాలుగేళ్లకు ఫలసాయం అందనుంది. ఈ కాలంలో రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు అంతర పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఇందుకూ అదనపు రాయితీలు అందిస్తున్నట్టు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. పొలంలో బోరుబావి ఉండీ కొత్తగా సాగు చేపట్టే రైతులకు రాయితీలు లభిస్తాయి.

625 ఎకరాల్లో సాగు విస్తరణకు ప్రణాళిక

ఉద్యానశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలో 2023–24 పంట కాలంలో 625 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్క తోటలను విస్తరించాలని లక్ష్యంగా అధికారులు నిర్దేశించారు. తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో రైతులను ప్రోత్సహించేందుకు రాయితీలు అందిస్తున్నారు. హెక్టారుకు 143 ఆయిల్‌పామ్ మొక్కలను నాటుకుంటే ఉద్యానశాఖ రాయితీ ఇస్తోంది. ఒక్కొక్క మొక్క విలువ రూ.193, ఇందులో రైతుకు రూ.100 రాయితీ లభిస్తుంది. ప్రతి సంవత్సరం ఎరువుల నిర్వహణకు రూ.5,250 చొప్పున నాలుగేళ్లకు రూ.21 వేలు ఇవ్వనున్నారు. అదనంగా 50 శాతం (రూ.50 వేలు మించకుండా) రాయితీపై చాప్ కట్టర్, హార్వెస్టింగ్ ఫోల్ ఇస్తున్నారు.

అంతర పంటలకు అదనపు రాయితీలు

ఆయిల్‌పామ్ మొక్కలు వేసిన నాలుగేళ్ల నుంచి ఫలసాయం అందనుంది. అప్పటి వరకు అంతర పంటలు సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ అదనపు ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఆయిల్‌పామ్ తోటలో మొక్కజొన్న, పొగాకు, వేరుశనగ, బొప్పాయి, అరటి, నువ్వులు, పొద్దు తిరుగుడు, బంతి, చామంతి, చిలకడ దుంపలు, కర్రపెడ్లం, పసుపు, కంద, అల్లం, మినుములు, పెసలు, ఉలవలు, కందులు, చెరకు, కూరగాయలు తదితర పంటలను రైతులు పండించుకోవచ్చు. ఇందుకు నాలుగేళ్లపాటు ప్రతిసంవత్సరం రూ.5,250 చొప్పున అదనపు రాయితీ లభిస్తుంది.



మొక్క తోటలను పరిశీలిస్తున్న హెచ్‌ఓ విజయలక్ష్మి

ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేయాలి



బోరుబావి, ఆయిల్‌పామ్ మొక్కలు ఉన్న పొలంలో అంతర పంటల సాగు చేసుకోవచ్చు. ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులు తమ పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నకళ్లు, పాస్‌పోర్టు సైజు ఫోటోతో రైతు భరోసా కేంద్రానికి వెళ్లి పూర్తి వివరాలను నమోదు చేయించుకోవాలి. అలా నమోదు చేయించుకున్న రైతులకు విస్తీర్ణాన్ని బట్టి మొక్కలను ఉద్యానశాఖ సరఫరా చేస్తుంది. నిర్వహణకు ఎరువులను ప్రతి సంవత్సరం అందిస్తారు. ఆయిల్‌పామ్ మొక్కలు వేసుకున్న తర్వాత అంతర పంటల సాగుచేసే రైతులకు అదనపు రాయితీలు లభిస్తాయి.

– జి.విజయలక్ష్మి, ఉద్యాన అధికారి, తుని

86.8 శాతం పింఛన్ల పంపిణీ



ప్రత్తిపాడులో వృద్ధుడు శేషారావుకు పింఛను అందిస్తున్న వలంటీర్ జ్యోతి

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/ఏలేశ్వరం: ప్రత్తిపాడు మండలంలో బుధవారం 86.8 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కుమార్ బాబు తెలిపారు. మండలంలోని ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి, ఉత్తరకంచి, పెద్దిపాలెం తదితర గ్రామాల్లో వలంటీర్లు తెల్లవారుజామున లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్లు అందజేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సిరిపురంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కొల్లా సతీష్

వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు



వైద్య విజ్ఞాన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వినయ్ మోహతా

జగ్గంపేట: నూతన వైద్య విధానాలపై పీఎంపీలు అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రవరానికి చెందిన మాగ్న తల్లీపిల్లల ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ వినయ్‌మోహతా సూచించారు. జగ్గంపేట షాదీఖానాలో బుధవారం కమ్యూనిటీ పారా మెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఎస్ మూర్తి అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినయ్‌మోహతా మాట్లాడుతూ ప్రథమ చికిత్స అందించడంలో పీఎంపీల పాత్ర ఎంతో కీలకమన్నారు. చిన్నారులకు వచ్చే జ్వరాలు, డయేరియా, పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ వినయ్‌మోహతాను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా కో కన్వీనర్ బళ్లా శ్రీనివాసరావు, మండల కో కన్వీనర్ జగతా బాబ్జీ, నూరుద్దీన్ బాషా, ఎ.సత్యనారాయణ, జగ్గంపేట, గండేపల్లి మండలాలకు చెందిన పీఎంపీలు పాల్గొన్నారు.

నేడు రాజుపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం

కిర్లంపూడి: మండలంలోని రాజుపాలెంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బడే రాజేశ్వరావు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మణిపూర్ అల్లర్లకు నిరసనగా ర్యాలీ



రౌతులపూడిలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

రౌతులపూడి: మణిపూర్‌లో గిరిజన మహిళలు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం రౌతులపూడిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మండలం పాస్టర్స్ ఫెలోసిప్ ఆధ్వర్యంలో గిడజాం సెంటర్ నుంచి సినిమా సెంటర్, మార్కెట్ సెంటర్ మీదుగా గ్రామ వీధుల్లో శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఫెలోసిప్ ప్రతినిధులు మాట్లాడుతూ మణిపూర్‌లో చర్చిలను ధ్వంసం చేసిన, మారణకాండకు కారణమైన బాధ్యులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు డిమాండ్లకు కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోసిప్ ప్రతినిధులు శామ్యూల్, పాస్టర్స్ ఫెలోసిప్ రాష్ట్ర అధ్యక్షుడు బండారు బైరాగి, యాదగిరి జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని గ్రామాలే లక్ష్యం



సీతంపేటలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- సీతంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం

శంఖవరం: పల్లెలను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని సీతంపేటలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కరోనా కష్ట కాలంలోనూ రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ జలకళ వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలు కావాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, సర్పంచ్ తోట నాగదేవి, కోఆప్షన్ సభ్యుడు గాబు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గౌతు నాగు, తలపంటి తిరుపతిరావు, తోట కృష్ణ, ఎంపీటీసీలు చల్లా సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మురారిలో వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- మురారిలో గడపగడపకూ మన ప్రభుత్వం

గండేపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని మురారిలో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్ ఎంపీపీ కుంచె రాజా, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జేసీఎస్ కన్వీనర్ తాళ్లూరి మధు, సర్పంచ్ కుక్కల ఆనంద్‌బాబు తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఎంపీటీసీ రుంజల రాణి, వీరవరం జేసీఎస్ కన్వీనర్ తోట విష్ణు తదితరులు పాల్గొన్నారు.

యువతకు సమాజంపై బాధ్యత ఉండాలి

గండేపల్లి: యువత సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని బ్రహ్మకుమారీ బీకే స్వరూపాదేవి విద్యార్థులకు సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలల్లో బుధవారం వై–20 పేరిట నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. మంచి అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిత్య, ప్రగతి కళాశాలల డైరెక్టర్స్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఎస్.శంభుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

ఏలేశ్వరం: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం వైఎస్సార్ సీపీ నేత లోగీష్ శేఖర్ తన తల్లి సత్యవతి జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్, బదిరెడ్డి శ్రీను, జువ్విన వీర్రాజు, ముచ్చెర్ల రమేష్, బట్టుపల్లి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



రౌతులపూడిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ గొల్లు చినదివాణం

రౌతులపూడి: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు విత్తనాలు, ఇతర వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. షెడ్యూల్ కులాలకు చెందిన రైతులకు రూ.9,000 విలువ చేసే వ్యవసాయ పనిముట్లు అందించారు. మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురి బైండోవర్

ప్రత్తిపాడు: స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిని బైండోవర్ చేసినట్టు ప్రత్తిపాడు ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామానికి చెందిన కట్టు కుమారి, కుంచే సత్యవతి, దడాల కుమారి, కడాలి చంద్రం, దడాల రాయుడులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, ఏలేశ్వరం తహసీల్దార్ వద్ద హాజరుపరచినట్టు చెప్పారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



శంఖవరంలో బాలింతలకు పౌష్టికాహార కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



జగ్గంపేటలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

శంఖవరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా ఇంటికే పౌష్టికాహారం పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకూ బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం అందించేవారన్నారు. ఇకపై లబ్ధిదారుల ఇంటికే సరుకులు అందజేస్తారని తెలిపారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారుల క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు ఎంపీపీ పర్వత రాజబాబు, రౌతులపూడి జెడ్పీటీసీ గొల్లు చిన్నదివాణం, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు వాసిరెడ్డి భాస్కరబాబు, జిగిరెడ్డి శ్రీను, అడపా వీరబాబు, బుర్ర లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.



గోకవరంలో గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి



తునిలో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

సంపూర్ణ పోషణతో మాతాశిశు ఆరోగ్యం

జగ్గంపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భం ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఇప్పటివరకూ అంగన్‌వాడీ కేంద్రంలోనే మెనూ ప్రకారం పోషకాహారం అందించేవారని తెలిపారు. కొందరు గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ఇంటికే పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం ,గ్రామ సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో మాతాశిశు ఆరోగ్యం

గోకవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు దంపతులు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రంలోనే మెనూ ప్రకారం సంపూర్ణ పోషకాహారం అందించేవారన్నారు. వారు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ఇంటికే పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకుందన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎంపీటీసీ తోలేటి రమ్యశ్రీ, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్సయ్య, బత్తుల నానాజీ, తోలేటి రాంప్రసాద్, మందపాటి సతీష్, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తుని: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. తుని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణపోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను ఆమె అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వార్డు కౌన్సిలర్ వారధి జ్యోతి, ఐసీడీఎస్ సీడీపీవో నిహారిక తదితరులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని గ్రామాల్లో బుధవారం నిర్వహించిన దాడుల్లో 30 లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ప్రత్తిపాడు ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం వేములపాలెం మూడు రోడ్ల జంక్షన్ వద్ద మోటారు సైకిల్‌పై సారా తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన బర్ల లోవరాజును అదుపులోకి తీసుకుని, అతని నుంచి బైక్, 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో చీకట్ల లక్ష్మిపై కూడా కేసు నమోదు చేసినట్టు చెప్పారు.అలాగే ప్రత్తిపాడు మండలం లంపకలోవలో సారా స్థావరంపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన వాసంశెట్టి సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఈబీ పోలీసులు తెలిపారు.

ఓటర్ల సర్వే పరిశీలన

కొత్తపల్లి: గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సర్వేను పారదర్శకంగా చేయాలని ఆర్‌ఐ పొన్నాల బీఎల్‌ఓలకు సూచించారు. మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదు కావాలన్నారు. ఒకే ఇంట్లో 10 ఓట్లు మించి ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. ఓటరు లిస్టులో ఉన్న వారి పేరు చదివి వినిపించడంతో పాటు వారి ఫొటోలను ఓటర్లకు చూపించాలన్నారు. ఓటర్లకు ఉన్న అభ్యంతరాలను నివృత్తి చేయాలని సూచించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.